ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 17.0

ANDHRAJYOTHY

5



వనపర్తి

జిల్లా వార్తలు

ఆదివారం 14 జనవరి 2024

కేటీదొడ్డివాసి కర్ణాటకలో మృతి

కేటీదొడ్డి, జనవరి 13: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గద్వాల జిల్లా కేటీదొడ్డికి చెందిన శివ(27) శనివారం తెల్లవారుజామున కర్ణాటకలోని రాయచూరు సమీపంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివ గొర్లను మేత కోసం కర్ణాటకలోని కల్లూరుకు తీసుకెళ్తుండగా రాయచూరు జిల్లా కేంద్రం దాటిన తర్వాత పవర్‌గ్రిడ్ ప్లాంటు సమీపంలో వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని బస్సు గొర్ల మంద, కాపరిపైకి దూసుకెళ్లింది. దాంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా కాపరులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. కేటీదొడ్డిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిర్లక్ష్యానికి.. ప్రాణాలు బలి

బీచుపల్లి వద్ద మంటల్లో దగ్ధమౌతున్న బస్సు



అగ్నికి పూర్తిగా దగ్ధమైన బస్సు





బీచుపల్లి వద్ద దగ్ధమైన బస్సును చూస్తున్న జనం

- రెండు దశాబ్దాల్లో ఎన్‌హెచ్ 44పై ఐదు భారీ ప్రమాదాలు
- మూడు ఘటనల్లో బస్సులు దగ్ధమై ప్రాణ నష్టం
- రెండు ప్రమాదాల్లో కృష్ణానదిలో బస్సులు పడి 76 మంది జల సమాధి
- అన్ని ఘటనల్లో అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం
- ప్రైవేటు ట్రావెల్స్ ఇష్టారాజ్యం.. ప్రమాదాల నుంచి పాఠాలు నేర్వని వైనం

గద్వాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అతివేగం, ఏమరపాటు.. నిర్లక్ష్యం.. ప్రైవేటు ట్రావెల్స్ ధనదాహం వెరసి నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదాలు కళ్లెదుటే కనిపిస్తున్నా గతం నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదు. పోటీపడి మరి బస్సులను పరుగులు పెట్టిస్తుండటంతో ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో జాతీయ రహదారి దాదాపు 200 కిలో మీటర్ల వరకు ఉండగా.. గడిచిన రెండు దశాబ్దాల్లో చాలా ప్రమాదాలు జరిగాయి. ఘోర ప్రమాదాలు ఐదు జరగ్గా.. భారీగా ప్రాణ నష్టం సంభవించింది. అయినా వేగం తగ్గించకపోవడంతో రోజూ ఎంతోమంది బలవుతూనే ఉన్నారు. కొన్నిసార్లు ఇతర వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతుండగా.. ఇంకొన్ని సార్లు నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. వాస్తవానికి జాతీయ రహదారిపై 80 కిలో మీటర్లకు మించి స్పీడ్ వెళ్లొద్దని, ఎక్కడ ఎంత వేగంతో వెళ్లాలనే సూచిక బోర్డులు ఉన్నా ఎవరూ ఆ నిబంధనలు పాటించడం లేదు. ఒకే సారి రెండు, మూడు వాహనాలను ఓవర్ టేక్ చేయడం, నిద్ర వస్తున్నా డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం కారణంగా పలుమార్లు టైర్లు పేలి, చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లోని ఆలూరు మాజీ ఎమ్మెల్యే ఒకరు టైర్ పేలడం ద్వారా రోడ్డు ప్రమాదం జరిగి చనిపోయారు. ఇక ప్రైవేటు ట్రావెల్స్ విషయానికి వస్తే.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఇదే రహదారిపై ప్రైవేటు ఆపరేటర్స్ బస్సులు నడిపిస్తుంటారు. రాత్రి 11 గంటలు దాటితే ప్రైవేటు ట్రావెల్స్ వెళ్తున్న స్పీడ్‌కు చాలామంది భయాందోళన చెందుతుంటారు. తాజాగా బీచుపల్లి వద్ద డ్రైవర్‌కు నిద్రవస్తున్నా బస్సు అలాగే నడపడంతో.. ముందు బోల్తా పడిన బస్సులో ఆ తర్వాత మంటలు అంటుకుని మాలతి అనే మహిళ సజీవ దహనం కావడం అందరినీ కలిచి వేసింది.



ప్రమాదంలో కాలి బూడిదైన మహిళ మృతదేహం ఆనవాళ్లు

1993లో 77 మంది జల సమాధి

బీచుపల్లి వద్ద కృష్ణానదిపై గతంలో ఒక బ్రిడ్జి మాత్రమే ఉండేది. ఈ బ్రిడ్జిపై ఇతర వాహనాలను ఓవర్ టెక్ చేస్తున్నప్పుడు, లేదా వాహనం వేగంగా నడిపినప్పుడు రెండు సార్లు భారీ ప్రమాదాలు జరిగాయి. 1993 ఆగస్టు రెండున కడప నుంచి హైదరాబాద్ వెళ్తున్న కడప డిపో ఆర్టీసీ బస్సు కృష్ణానది వద్దకు వచ్చాక ఓవర్ టెక్ కారణంగా నదిలో పడిపోయింది. అప్పుడు నదిలో నీరు వేగంగా ప్రవహిస్తుండటంతో బస్సులో ఉన్న దాదాపు 36 మంది జలసమాధి అయ్యారు. మృతదేహాలను యాపర్ల, మునగమాన్‌దిన్నె, గుమ్మడం వద్ద కొన్ని రోజుల పాటు వెతికిన తర్వాత వెలికితీశారు. అప్పటికే చేపలు, మొసళ్లు తినడంతో మృతదేహాలు గుర్తుపట్టని విధంగా మారాయి. ఈ ఘటన జరిగిన నాలుగేళ్ల తర్వాత 1997 సెప్టెంబరు 26న ఆళ్లగడ్డ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని తప్పించబోయి కృష్ణాదిలో పడిపోయింది. ఆ సమయంలో బస్సులో 44 మంది ఉండగా.. 40 మంది మృతి చెందారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటి మంత్రులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పుడు కూడా నది ఉధృతంగా ప్రవహిస్తుండటం, క్రేన్లు అందుబాటులో లేకపోవడంతో బస్సు వెలికితీత చాలా ఆలస్యమైంది. సమీపంలోని జాలర్లు తీవ్రంగా శ్రమించిన తర్వాత మూడు నుంచి నాలుగు రోజుల్లో మృతదేహాలను వెలికితీశారు. ఈ రెండు ఘటనల్లోనూ ఇతర వాహనాలను ఓవర్‌టెక్ చేస్తున్న సమయంలోనే బస్సులు నదిలో పడిపోయాయి. పాత బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో అప్పుడు కొత్తగా మరో బ్రిడ్జి నిర్మించాలనే డిమాండ్లు వచ్చాయి. ఆ తర్వాత కొద్దిరోజులకు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొత్త బ్రిడ్జిని నిర్మించారు. ఇక అప్పటి నుంచి వాహనాలు నదిలో పడిన ఘటనలు జరగలేదు.

2002లో 59 మంది సజీవ దహనం..

కృష్ణానదిలో రెండుసార్లు బస్సులు బోల్తా పడటం వల్ల భారీగా ప్రాణనష్టం జరగ్గా.. మూడు సార్లు డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ప్రమాదాలు జరిగి 59 మంది సజీవ దహనం అయ్యారు. గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపూర్ వద్ద సెప్టెంబరు 25, 2002లో హైదరాబాద్ నుంచి కడప జిల్లాలోని రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో మంటలు చెలరేగడంతో బస్సులో ఉన్న 31 మందిలో 13 మంది సజీవ దహనం అయ్యారు. 18 మంది తీవ్రంగా కాలిన గాయాలతో బయటపడ్డారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితులను ఓదార్చడంతో పాటు.. ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆ తర్వాత 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్ ఓల్వో బస్సు ప్రమాదానికి గురైంది. బస్సు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం వద్దకు చేరుకోగానే అతివేగం కారణంగా కల్వర్టుకు.. బస్సు డీజిల్ ట్యాంకర్‌కు రాపిడి జరిగి బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 45 మంది నిద్రిస్తున్న సీట్లలోనే సజీవ దహనం కాగా.. ఏడుగురు ప్రాణాలతో బయటపడ్డారు. బెంగళూరు నుంచి అక్టోబరు 29న రాత్రి 11 గంటలకు బస్సు బయల్దేరగా.. కొత్తకోట మండలం పాలెం వద్దకు చేరుకునే సరికి ఉదయం 5:30 గంటలు అయ్యింది. ఈ ఘోర దుర్ఘటన అప్పట్లో సంచలనంగా మారింది. ఆ తర్వాత తాజాగా హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న జగన్ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా బీచుపల్లి వద్ద బోల్తాపడి, మంటల చెలరేగాయి. ఈ ఘటనలో హైదరాబాద్‌లోని ఇండియన్ రైస్ రీసర్చ్ సెంటర్‌లో ఫెలో సైంటిస్టుగా పనిచేస్తున్న మాలతి అనే మహిళ సజీవ దహనమైంది. అన్ని ఘటనల్లో నిర్లక్ష్యమే ప్రధాన కారణమని తెలువగా.. వేగానికి నియంత్రణ జరగలేదు. అలాగే నిద్ర కూడా చాలా ప్రమాదాలకు కారణమవుతూనే ఉంది.



2013 అక్టోబరు 30న వనపర్తి జిల్లా కొత్తకోట వద్ద దగ్ధమౌతున్న జబ్బార్ ట్రావెల్స్ ఓల్వో బస్సు

పండగొచ్చింది..

- మూడు రోజుల సంక్రాంతి వేడుకలకు ఏర్పాట్లు
- పట్టణాలు, నగరాల నుంచి పల్లెలకు చేరుకున్న జనం
- సందడిగా మారిన గ్రామాలు
- నేడు భోగి.. రేపు సంక్రాంతి

మహబూబ్‌నగర్, జనవరి 13: సంక్రాంతి పండుగ అంటేనే సంబురం. సకల శుభాలనిచ్చే ఈ పండగను అన్ని వర్గాల ప్రజలు గొప్పగా జరుపుకుంటారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, ఇళ్లముందు రంగుల హరివిల్లులు, గొబ్బెమ్మలు, భోగిమంటలంతో మూడు రోజుల పాటు సాగే పండుగను ఘనంగా చేసుకుంటారు. నేడు ఆదివారం నుంచి జరిగే పండుగను జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివిధ అవసరాల రీత్యా.. పట్టణాలు, నగరాల్లో ఉన్న జనం ఇప్పటికే సొంతూళ్లకు చేరుకున్నారు. దాంతో పల్లెలన్నీ సందడిగా మారాయి. పట్టణాల్లో రద్దీ తగ్గిపోగా.. పల్లెలు మాత్రం కళకళలాడుతున్నాయి. ఊళ్ళో జాతరలు, ఎద్దుల బండ్ల ప్రదర్శనలు, క్రీడాపోటీల నిర్వహణకు పల్లెలు సిద్ధమయ్యాయి. హరిలోరంగ హరి అంటూ హరిదాసులు చిడతలు వాయిస్తూ సందడి చేయడంతో పాటు భోగి రోజు గంగిరెద్దుల విన్యాసాలు పండుగకు మరింత కళను తెస్తాయి.

భోగి మంటలకు రెడీ

భోగి పండుగకు ప్రత్యేకత ఉంది. మనలోని పాత ఆలోచనలను అగ్నిలో ఆహూతి చేసి, కొత్త ఆలోచనలకు నాంది పలికేందుకు పాత సామాగ్రిని భోగి మంటల్లో వేసి దహనం చేస్తుంటారు. ఇళ్లముందు ముగ్గులు వేసి, అందులో పేడతో గొబ్బెమ్మలు చేసి.. నవధాన్యాలు, పూలు, రేగుపళ్ళతో అలంకరించనున్నారు. ఆదివారం సంక్రాంతి రోజు పిండి వంటకాలను చేసుకుంటారు.

గాలిపటాలు, రంగులకు డిమాండ్

సంక్రాంతి పండుగ నేపథ్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని మార్కెట్‌లన్నీ రద్దీగా మారాయి. రంగులు, పతంగుల కొనుగోళ్లతో రద్దీ పెరిగింది. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ సరదాగా గాలిపటాలు ఎగుర వేస్తుంటారు. అందుకే మార్కెట్‌లో రకరకాల గాలిపటాలను కొనుగోలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు పట్టణాలకు వచ్చి సరుకులు, కిరాణ సామాగ్రి కొనేందుకు ఎగబడుతుండటంతో దుకాణాలు, మార్టులు రద్దీగా మారాయి. పట్టణంలోని క్లాకటవర్, పాన్ చౌరస్తా, మార్కెట్ ఏరియా, న్యూటౌన్ ప్రాంతాలలో సరుకులు, రంగులు కొనేందుకు అధికంగా వస్తుండటంతో పండుగ వాతావరణం కనిపిస్తోంది.



మహబూబ్‌నగర్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న రంగులు

కాంగ్రెస్‌లోకి మన్నె జీవన్

- సీఎం రేవంత్‌తో కలిసి కేసీ వేణుగోపాల్‌తో సమావేశం
- ఎమ్మెల్సీ పదవికి అధిష్ఠానం హామీ
- నెలాఖరులో అధికారికంగా చేరిక
- ఇప్పటికే ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో చర్చించిన ముఖ్యమంత్రి
- బీఆర్ఎస్‌కు ఝలక్..!



మహబూబ్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రముఖ పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. శనివారం మధ్యాహ్నం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఆయన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక, ఆయనకు కల్పించే అవకాశాలపై స్పష్టత రావడంతో హస్తం కండువా కప్పుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. మహబూబ్‌గర్ సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి స్వయానా అన్న కుమారుడైన జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడానికి కుటుంబం నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాతే చేరికకు ఏర్పాట్లు మొదలయ్యాయి. జీవన్‌రెడ్డి చేరికపై ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో ఇప్పటికే చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా ఆయన్ను కేసీవేణుగోపాల్‌తో సమావేశానికి తీసుకెళ్లారని పార్టీ ముఖ్య నాయకులు తెలిపారు. సీఎం విదేశీ పర్యటనల అనంతరం ఈ నెలాఖరులో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో జీవన్‌రెడ్డి, ఆయన అనుచరవర్గం కాంగ్రెస్‌లో అధికారికంగా చేరనున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్సీ పదవికి హామీ ఇచ్చిన అధిష్ఠానం

జీవన్‌రెడ్డి చేరికతో కాంగ్రెస్‌కు కలిసొస్తుందనే విశ్వాసంతో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి స్వయంగా ఆహ్వానించడంతో పాటు ఆయన రాజకీయ భవిష్యత్‌కు స్పష్టమైన హామీ ఇప్పించేందుకు పార్టీలో క్రియాశీలక నాయకుడు కేసీ వేణుగోపాల్‌తో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. పార్లమెంటు ఎన్నికల్లో జీవన్‌రెడ్డి సేవలు వినియోగించుకోవడంతో పాటు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అనుచరవర్గం, ఆయన చేసిన సేవా కార్యక్రమాలు పార్టీకి అదనపు బలం చేకూరుస్తాయనే విశ్వాసాన్ని సీఎం సహా ముఖ్య నాయకులు వ్యక్తం చేసినట్లు తెలిసింది. జీవన్‌రెడ్డి పార్టీలో చేరిన తర్వాత శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పిస్తామని, ఇందుకు తమదే బాధ్యత అని అధిష్ఠానం, ముఖ్య నాయకులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈవిషయమై ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశం ఫలప్రదంగా ముగిసిందని, తన రాజకీయభవిష్యత్‌కు వారు భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానిత సభ్యుడు వంశీచంద్‌రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో మద్దతుగా తామంతా పని చేస్తామని తెలిపారు.

ఐదేళ్లుగా తెరవెనుక..

తన చిన్నాన్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసినప్పటి నుంచి జీవన్‌రెడ్డి రాజకీయాలతో పరోక్షంగా సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆ ఎన్నికల్లో బాబాయి విజయం కోసం ఆయన కృషి చేశారు. ఫౌండేషన్ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా బాలికల విద్యావ్యాప్తికి, వైద్య సేవలకు కృషి చేశారు. కరోనా సమయంలో మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. యువతకు క్రీడా పోటీలు, ఇతర సామాజిక సేవలకు ప్రాధాన్యమిచ్చారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా రెండేళ్ల పాటు పని చేశారు. ఆపదవి ద్వారా ఆధ్యాత్మిక, ధార్మిక ప్రచారానికి దోహదపడ్డారు. గత ఐదేళ్లుగా ఆయన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రజా సంబంధాలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైనప్పటి నుంచి జీవన్‌రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తారనే చర్చ మొదలైంది. రేవంత్‌రెడ్డితో మొదటి నుంచి ఉన్న సాన్నిహిత్యం ఈ చర్చకు బలాన్ని చేకూర్చితే.. మన్నె సత్యనారాయణ(ఎంఎస్ఎన్) కుటుంబం నుంచి కూడా కాంగ్రెస్‌లో చేరిక అంశంపై జీవన్‌రెడ్డి ఆమోదం తీసుకున్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అప్రతిహత విజయాన్ని నమోదు చేయడం, సీఎంగా రేవంత్‌రెడ్డికే అవకాశం రావడంతో జీవన్‌రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకు మార్గం సుగమం అయ్యింది. సన్నిహితులు, అనుచరవర్గం నుంచి కూడా కాంగ్రెస్‌లో చేరాలనే సూచనలు రావడంతో జీవన్‌రెడ్డి ఎట్టకేలకు పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే పార్టీకి ఉపయుక్తమేననే అభిప్రాయం కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తోంటే, కార్యకర్తల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

బీఆర్ఎస్‌కు ఎదురు దెబ్బ

మహబూబ్‌నగర్ సిట్టింగు ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన యువ నాయకుడు జీవన్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవడం బీఆర్ఎస్‌కు షాకిచ్చినట్లయింది. ఎంపీగా శ్రీనివాస్‌రెడ్డి పోటీ చేసినప్పటి నుంచి తెరవెనుక రాజకీయాలు నడిపిన జీవన్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్ స్వయంగా రంగంలోకి దిగడంతో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బగానే భావిస్తున్నారు. రెండు రోజుల క్రితం వరకు కూడా ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉంటారని ఆ పార్టీ చర్చ జరుగగా.. తాజా పరిణామాలతో ఇక ఆయన పోటీలో ఉండరనే సంకేతాలను వస్తున్నాయి. జీవన్‌రెడ్డి ఎపిసోడ్‌ని రాజకీయ వర్గాలు కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశంగా, బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బగా భావిస్తున్నాయి.

జాతీయ నెట్‌బాల్ క్రీడలు ప్రారంభం

మహబూబ్‌నగర్, జనవరి 13: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో గల ఇండోర్ స్టేడియంలో జాతీయ నెట్‌బాల్ క్రీడలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ విజేందర్‌సింగ్ పోటీలను ప్రారంభించారు. 28 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ నేషనల్ ఫాస్ట్ 5 నెట్‌బాల్ టోర్నీలో పాల్గొన్నారు. మహిళలు, పురుషుల జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. దాదాపు 700 మంది క్రీడాకారులతో పాలమూరు కిటకిటలాడింది. నాలుగు రోజులపాటు ఈ టోర్నీ జరుగనుంది. క్రీడల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. క్రీడాకారుల కోసం పాఠశాలల్లో వసతి ఏర్పాటు చేశారు. తొలిమ్యాచ్ హర్యానా, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరుగగా, హర్యాన 44-22 స్కోర్‌తో ఏపీపై విజయం సాధించింది.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే జీఎంఆర్

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. టోర్నీ ప్రారంభించిన అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. జాతీయ క్రీడలకు మహబూబ్‌నగర్ వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. 28 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాలమూరులో ఉన్నారంటే భారతదేశం అంతా ఇక్కడే కనిపిస్తుందన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇలాంటి టోర్నీలు జిల్లాలో ఇక ముందు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్యరెడ్డి, ఖాజాఖాన్, ఉపాధ్యక్షుడు సాదత్‌ఖాన్, కోశాధికారి సోహెల్, కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్, ఆనంద్‌కుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.



తలపడుతున్న హర్యానా, ఏపీ జట్లు

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ రాధిక - కాప్రా
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
గలేరియా - పంజాగుట్ట	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
అట్రియమ్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఎస్2 నోమ - మల్లాపూర్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	మూవీటైమ్ - అమీర్‌పేట
ఎం.పి మాల్ - కాచిగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జిఎస్ఎమ్ - మదీనగూడ	టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మంత్రామాల్- అత్తాపూర్	మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ	జె.పి.సినిమాస్ - చందానగర్

విద్యుత్ తీగలను పట్టుకుని వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, జనవరి 13 : తాగుడుకు బానిసైన వ్యక్తికి మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో విద్యుత్ తీగలను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ప్రస్తుతం ఏనుగొండలో నివాసం ఉంటోంది. 14 ఏళ్ల క్రితం ఆమె భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తరువాత ఏడాదికి మిర్యాలగూడ మండలం అడవిదేవులపల్లికి చెందిన వెంపటి ప్రవీణ్‌తో పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ప్రవీణ్ కొన్నాళ్ల క్రితం ఉద్యోగం మానేశాడు. ఆ తరువాత వైన్‌షాప్‌లో పనిచేస్తు తాగుడుకు బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి డబ్బుల కోసం లక్ష్మమ్మను ఇబ్బంది పెట్టేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 11వ తేదీన మద్యం కోసం డబ్బులు అడిగితే ఆమె లేవని చెప్పడంతో గొడవ పడి వెళ్లిపోయాడు. శనివారం లక్ష్మమ్మ కూతురు మేడపైకి దుస్తులు ఆరేసేందుకు వెళ్లగా అక్కడ ప్రవీణ్ చనిపోయి ఉండటాన్ని గమనించి తల్లికి విషయం చెప్పింది. ఆమె వెళ్లి చూడగా ప్రవీణ్ విద్యుత్ తీగను పట్టుకుని చనిపోయి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా, వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

గొర్రెల అపహరణ, కేసు నమోదు

ఉప్పునుంతల, జనవరి 13 : గొర్రెల అపహరణపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని రాయిచెడు గ్రామంలో చోటుచేసుకొంది. ఎస్సై గురుస్వామి, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జాజాల శ్రీనుకు 60 గొర్రెలు ఉన్నాయి. ఉదయం పూట మేతకు తీసుకెళ్లి రాత్రి వేళలో తన ఇంటి పక్కన గొర్కెల మంద ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో మందలో గొర్రెలు కొట్టి కాపలాగా తన తండ్రి బిచ్చయ్య ఉన్నాడు. అర్ధరాత్రి కరెంటు అఫ్ చేసి ఇంటికి గొల్లం పెట్టి మందలలో నుంచి 15 గొర్రెలను వాహనంలోకి ఎక్కుతుండగా గొర్రెల అరుపులు విని కూతురు లేచి తండ్రి బిచ్చయ్యకు కేకలు వేయగా, అరుపులు విన్న దొంగలు వాహనంతో పరారయ్యారు. గొర్రెల మందలో చూస్తే 14 గొర్రెలు, ఒక మేక అపహరించిన్నట్లు గుర్తించి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన సల్థానికి తన సిబ్బందితో ఎస్సై వెళ్లి దొంగతనం గురించి బాధితుడు శ్రీను అడిగి తెలుసుకున్నారు. 14 గొర్రెలు, ఒక మేక విలువ సుమారు 2 లక్షల పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు.

దేవాలయాల దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..


గొడ్డాల ఈశ్వర్(ఫైల్)

గద్వాల క్రైం, జనవరి 13 : దేవాలయ దర్శనానికి వెళ్తూ ఓ వ్యక్తి మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి కీసరకు చెందిన గొడ్డాల ఈశ్వర్(41) తన కుటుంబసభ్యులతో కలిసి మదురై దేవాలయాల దర్శనానికి వెళ్లేందుకు శనివారం ఉదయం కాచిగూడ నుంచి మధురై వెళ్లే రైలు ఎక్కిన్నారు. రైలు మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న తర్వాత ఈశ్వర్ కొంత నీరసంగా కనిపించాడు. ఆ తర్వాత అపస్మారక స్థితిలో వెళ్లగా రైలు గద్వాల రైల్వేస్టేషన్‌కు సమీపిస్తుండగా 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి గతంలో గుండెపోటు రాగా స్టంట్ కూడా వేయించారని కుటుంబ సభ్యులు తెలిపారు. గుండెపోటు కారణంగానే మృతిచెంది ఉండవచ్చనే తెలుస్తోంది. మృతుడికి భార్య ఇంద్ర, ఒక కుమారుడు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. శవపరీక్ష అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అనారోగ్యంతో చిరుత మృతి


మృతి చెందిన చిరుత

దామరగిద్ద, జనవరి 13 : అనారోగ్యంతో ఓ చిరుత పులి మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం వత్తుగుండ్ల, కంపాన్‌పల్లి గ్రామాల మధ్య శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వత్తుగుండ్ల గ్రామ రైతు జింక కన్నప్ప పొలంలో శనివారం సాయంత్రం మూడు చిరుతలు రైతులకు కనబడ్డాయి. ఇందులో ఓ పెద్ద చిరుతతో పాటు మరో రెండు చిన్న చిరుతలు ఉన్నాయి. ఓ చిరుత అనారోగ్యంతో పొలంలోనే ఉండి పోగా గమనించిన రైతులు ఫారెస్టు అధికారులకు, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులు నారాయణరావు, రఘునాథ్, ఎస్ఐ శ్రీనివాస్, లక్ష్మణ్, సంతోష్ చిరుత సంచరిస్తున్న స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. పోస్టుమార్టం అనంతరం వివరాలు తెలుస్తాయని ఫారెస్టు అధికారులు తెలిపారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి (ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

కుల, మత రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటు

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే.అరుణ
- పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలతో డీకే అరుణ

మహబూబ్‌నగర్(క్లాక్‌టవర్), జనవరి 13 : దేవుడి పట్ల నమ్మకం, రాముని పట్ల భక్తి ఉన్నవారు ఎవరైన అయోధ్య నగరానికి రావచ్చని, అయోధ్యలో రామమందిరం నిర్మాణ దశలో ఉందని, ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ కుల, మత రాజకీయాలు చేయడం ఆ పార్టీకి అలవాటు అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే.అరుణ అన్నారు. అక్కడ రామమందిర నిర్మాణం దేశంలో కోట్లాది ప్రజల విశ్వాసానికి ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయం అనుకుంటే వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. ఈనెల 23 తర్వాత అయోధ్యలోని రామమందిరాన్ని దర్శించుకునేందుకు గాను ప్రభుత్వం రవాణ సౌకర్యం కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి.పద్మజారెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాహితీరెడ్డి, నిరంజనమ్మ, రామేశ్వరి, కొత్తకోట కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అచ్చుగట్ల అంజయ్య, కొండయ్య, పోతుల రాజేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్ తదితరులున్నారు.

సంప్రదాయానికి ప్రతీక ముగ్గులు


భూత్పూర్‌లో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత

భూత్పూర్, జనవరి 13 : ముగ్గులు సాంప్రదాయాలకు ప్రతీక అని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవిత విజేతలకు బహుమతులను అందించారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటి ముందు వేసే ముగ్గులు లక్ష్మీదేవికి ఆహ్వానం పలుకుతాయని అన్నారు. మహిళలు ప్రతిరోజు వాకిట్లో కల్లాపి చల్లి ముగ్గులు వేసి ఇంటి పనుల్లో మొదటి స్థానాన్ని ఇస్తారని అన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలను కవిత ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎలికట్ట గోవర్ధన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, నాయకులు శ్రీను, వెంకట్‌నారాయణ, జమీర్, మశ్చందర్, శ్రీశైలం, నరేందర్ ఉన్నారు.

మంట కలిసిన మానవత్వం

శిశువును చెత్తకుప్పలో పడేశారు..


ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువుకు వైద్యం అందజేస్తున్న వైద్యులు

తెలకపల్లి, జనవరి 13 : మానవత్వం మంట కలిసిపోయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని తాళ్లపల్లిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. అప్పుడే పుట్టిన శిశువును గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకుప్పలో పడేశారు. చెత్తకుప్పలో మగ శిశువును చూసి స్థానికులు పోలీసులకు తెలిపారు. దాంతో పోలీసులు శిశువును జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శిశువు ఐసీడీఎస్ మహబూబ్‌నగర్ అధికారుల పర్యవేక్షణలో ఉంది.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ.. యువకుడు మృతి


జాలం నాగేష్ (ఫైల్)

బిజినేపల్లి, జనవరి 13 : ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని జాలం నాగేష్(26) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్‌లో శనివారం ఉదయం మృతుడు బైక్‌పై మహబూబ్‌నగర్ వైపు వెళ్తుండగా నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన నాగేష్ ఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. తల్లిదండ్రులకు నాగేష్ ఏకైక సంతానం కావడంతో పాటు మృతుడికి నాలుగు నెలల క్రితమే వివాహం కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య మమత, తల్లిదండ్రులు జాలం శేఖర్, నాగమ్మలు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో ఎస్సై గోపాల్‌నాయక్ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

మంగనూర్ గ్రామానికి చెందిన జాలం నాగేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుడి తల్లిదండ్రులకు, భార్య మమతలకు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట గ్రామ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తిరుమల్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, బాలకృష్ణ, జైపాల్‌యాదవ్, మ్యాకల మాసయ్య తదితరులు ఉన్నారు.

టెంకాయల విక్రయానికి వేలం

- రూ. 9లక్షల 10వేలకు దక్కించుకున్న తులసీరాం
- తైబజారుకు రూ. 3లక్షల 75వేలు

అచ్చంపేట అర్బన్, జనవరి 13 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలి దర్గా ఉర్సు ఉత్సవాలకు శనివారం రంగాపూర్, దర్గతండాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో అచ్చంపేట పంచాయతీరాజ్ శాఖ డీఎల్‌పీవో వెంకటయ్య, ఎంపీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేలం పాటలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు లోక్యానాయక్, లచ్చునాయక్‌ల సమక్షంలో గ్రామస్థులు, వివిధ గ్రామాల వారు వేలంలో పాల్గొన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం అయిన వేలం పాట సాయంత్రం వరకు కొనసాగింది. కొబ్బరి కాయల వేలంలో దాదాపు 40మంది పాల్గొనగా రంగాపూర్ గ్రా మానికి చెందిన తులసీరాం రూ.9లక్షల 10వేలకు వేలంలో పాడి టెండరు దక్కించుకున్నాడు. అదేవిధంగా తైబజారు వేలంలో 49మంది పాల్గొనగా, అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్‌నాయక్ రూ.3లక్షల 73వేలకు టెండరు దక్కించుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు మొత్తం రూ.12లక్షల 83వేలు గ్రామ పంచాయతీలకు వచ్చినట్లు తెలిపారు.

అట్టహాసంగా అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు


ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తాడూరు, జనవరి 13 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వృషభరాజుల బండలాగుడు పోటీలు అంతర్రాష్ట్ర స్థాయిలో శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 16జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి చేతుల మీదుగా బండలాగుడు పోటీలను ప్రారంభించారు. పోటీల్లో మొదటి బహుమతి తాడూరు మండలం యాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అఖిలేష్‌రెడ్డి ఎద్దులు గెలుపొందగా రెండవ బహుమతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్ఆర్ జిల్లా జమ్మినది గ్రామానికి చెందిన వార్షలా గుర్విరెడ్డి ఎద్దులు సొంతం చేసుకున్నాయి. మూడవ బహుమతి దొడ్డికాటి తిరుమలేష్ కర్నూల్ జిల్లాకు చెందిన ఎద్దులు గెలుపొందగా నాల్గవ బహుమతి నంద్యాల జిల్లా ఓబుల్‌రెడ్డికి చెందిన వృషభాలు గెలుపొందాయి. ఐదవ బహుమతి గద్వాల జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ ఎద్దులు గెలుపొందగా ఆరవ బహుమతి నంద్యాల జిల్లాకు చెందిన చిన్నఖానాల ఊరి వాస్తవులు చిన్నారెడ్డి ఎద్దులు పాల్గొన్నాయి. 7వ బహుమతి గద్వాల జిల్లా విఠల్‌రాయుడు బ్రదర్స్ ఎద్దులు గెలుపొందగా 8వ బహుమతి నంద్యాల జిల్లా మోక్షితరెడ్డి ఎద్దులు గెలుపొందాయి. వీరందరికీ మొదటి బహుమతి 80వేలు, రెండవ బహుమతి 70వేలు, మూడవ బహుమతి 60వేలు, నాల్గవ బహుమతి 50వేలు, ఐదవ బహుమతి 40వేలు, ఆరవ బహుమతి 30వేలు, ఏడవ బహుమతి 20వేలు, ఎనిమిదవ బహుమతి 10వేల రూపాయలు అందించగా గెలుపొందని వృషభరాజుల యజమానులకు సైతం కన్సలేషన్ బహుమతుల కింద ఐదువేల రూపాయలను అందించినట్లు నిర్వాహకులు సంద మల్లయ్య తెలిపారు. గెలుపొందిన వారందరికీ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మందడి రోహిణి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి యాంకర్‌గా రహమాన్‌పాషా నిర్వహించారు. మొత్తంగా అంతర్రాష్ట్ర వృషభరాజుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా ముగిశాయి. స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సంద రేణుక, మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్, చిన్నపురెడ్డి, కోటేశ్, గోవర్ధన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ముస్లింలు

నూతనంగా ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తొలిసారిగా తాడూరు మండల కేంద్రానికి రావడంతో శనివారం ముస్లిం సోదరులు స్థానిక మసీద్‌లోకి ఆహ్వానించి శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు.

‘పాలమూరు పార్లమెంట్ స్థానాన్ని

బీసీలకు కేటాయించాలి’

పాలమూరు, జనవరి 13 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానాన్ని అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే కేటాయించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 70శాతం బీసీలు ఉండటంతో ఆ స్థానాన్ని కచ్చితంగా బీసీలకు కేటాయిస్తే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నేతరాలుగా రెడ్డిలు రాజకీయాల్లో రాజ్యమేలుతూ బీసీలను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలకు బీసీ సమాజ్ తరపున లేఖలు రాస్తామన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి అగ్రవర్ణాలకే సీట్లు కేటాయిస్తూ వస్తుండటంతో బీసీలు కులవృత్తులు కోల్పోయి వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన చెందారు. మన ఓటు.. మన బీసీకే వేసుకుని పరాయివాడిని ఓడిద్దామనే నినాదంతో ముందుకు సాగుదామని బీసీ యువతకు పిలుపునిచ్చారు. బీజేపీలో బీసీ వర్గానికి చెందిన శాంతికుమార్‌ను కాదని రెడ్డివర్గం జితేందర్‌రెడ్డి, డీకే.అరుణలు అడ్డుపడుతున్నారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన చరిత్ర ఉందన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులను కేటాయించాలన్నారు. సమావేశంలో జిల్లా కోకన్వీనర్ సవారి సత్యం, బీసీ సమాజ్ మహబూబ్‌నగర్ కన్వీనర్ ఆర్.సత్యంలు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్, జనవరి 13: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని నాగవరం తండాలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే మొదటగా క్రీడలు గుర్తుకొస్తాయన్నారు. అందులో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను స్నేహపూర్వకంగా జరుపుకోవాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడలను స్వాగతించాలన్నారు. క్రికెట్‌తో పాటు అన్ని రకాల క్రీడల్లో యువత నైపుణ్యం ప్రదర్శించాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, సత్యశీలారెడ్డి, కౌన్సిలర్లు సుమిత్ర, యాదగిరి, సత్యంసాగర్, విభూది నారాయణ, మాజీ కౌన్సిలర్ కృష్ణబాబు, నాయకులు లక్కాకుల సతీష్, చంద్రమౌళి, చుక్కరాజు, శశాంక్, ఆదిత్య, డి వెంకటేష్, క్రికెట్ ఆర్గనైజర్లు రాజు నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాయిగడ్డలో..

పట్టణంలోని రాయిగడ్డలో పూజారి కృష్ణయ్య స్మారక క్రికెట్ పోటీలను కౌన్సిలర్ బ్రహ్మంచారి ప్రారంభించారు. ప్రతీ ఏడాది అనవాయితీగా క్రీడల పోటీలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ఈ ఏడాది సంక్రాంతి పండుగను పురస్కరించుకుని క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో పూజారి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, రంజిత్, బోయ మురళి, మాజీ కౌన్సిలర్ చుక్క రాజు, మండ్ల దేవన్న నాయుడు, రాగివేణు, వంశి, మోహన్, మండ్ల రఘు, విజయ్‌కుమార్, రాకేష్, నాని, తైలం సాయి, భాస్కర్, రాయిగడ్డ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని అడ్డుకోవడం సరికాదు

- మునిసిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు, జనవరి 13: కౌన్సిల్ సమావేశానికి కాంగ్రెస్ నాయకులు అడ్డు తగలడం సరికాదని మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో వైస్ చైర్మన్ కర్రెస్వామితో కలిసి ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో మండలంలో అనేక అభివృద్ధి పనులు చేశామని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అనేది గుర్తించాలని అన్నారు. శుక్రవారం పురపాలక కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గంతో పాటు ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పాల్గొన్నారని గుర్తు చేశారు. కౌన్సిల్ సమావేశంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ జరగబోయే అభివృద్ధిని కూడా ఎమ్మెల్యే దృష్టికి పురపాలకవర్గం తీసుకుపోయిందని అన్నారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిల్ సమావేశంలోకి ప్రవేశించి సమావేశాన్ని జరగకుండా నినాదాలు చేస్తూ అడ్డు తగలడం సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు కట్టుబడి ఉన్నామని అన్నారు. కాంగ్రెస్ నాయకుల తీరు మార్చుకోవాలని వారు హితవు పలికారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ ఎల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వనంరాములు, నాయకులు రాజశేఖర్, ఎండీ మజీద్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు



రోడ్డుపై మట్టి పోసి చదును చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్, జనవరి 13: మండల కేంద్రం నుంచి శాఖాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు గ్రంథాలయ డైరెక్టర్ చిన్న బాలరాజు ఆధ్వర్యంలో శనివారం రోడ్డు మరమ్మతులు చేపట్టారు. మండల కేంద్రం నుంచి శాఖాపూర్ వరకు దాదాపు 5 కిలో మీటర్లు రోడ్డు గుంతలు ఏర్పడింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఫోర్ కమిటీ సమావేశం నిర్వహించి తమ సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టారు. మండల కేంద్రం నుంచి శాఖాపూర్ వరకు గుంతల్లో మట్టిని నింపి చదును చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగేంద్రం, నాయకులు పెద్ద బాలరాజు, రాములు, మైబుస్, శ్రీనివాస్‌యాదవ్, కురుమయ్య, పెద్ద మైబుస్, రాముడు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్ఐ రవిప్రకాష్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

వీపనగండ్ల, జనవరి 13: క్రీడల వల్ల శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందని ఎస్ఐ రవిప్రకాష్ తెలిపారు. శనివారం మండలంలోని సంగినేనిపల్లిలో ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎస్ఐ, ట్రస్టు చైర్మన్ ఇంద్రకంటి వెంకటేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ఆడాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచు మౌలాలి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, నారాయణరెడ్డి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, మీసాల మోహన్, వెంకటేష్, సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

వనపర్తి టౌన్, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వనపర్తి పట్టణంలోని కర్రెమ్మ గుడి దగ్గర శనివారం కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. గంధం ఆంజనేయులు స్మారకార్థం నిర్వహించిన ఈ పోటీలను ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, దళిత అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు ద్యారపోగు రవిప్రసాద్ ప్రారంభించారు. ఎంతో ఉత్సహంగా సాగిన ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. ఆదివారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు గంధం చరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత అభివృద్ధి సంఘం నాయకులు బంకలి ఆంజనేయులు, గంధం బుచ్చన్న, ద్యారపోగు సురేందర్, కొమ్ము నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

సూగూరులో..

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరులో సంక్రాంతి పండుగ సందర్భంగా కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు రాజశేఖర్ గౌడ్, నాయకులు ఎస్.వేణుగోపాల్, పరశురాం, నరసింహనాయుడు, మణ్యుఖి, మంద వెంకటయ్య, జూదం రమేస్, మక్బూల్, మహేష్‌గౌడ్, నరసింహ, అద్వాని తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చంద్రమ్మ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీరంగాపూర్, జనవరి 13: శ్రీరంగాపురం దళితవాడలోని చంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి కుమారుడు ఆదిత్యరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్‌లు శనివారం ఆమె మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బీరం రాజశేఖర్‌రెడ్డి రూ. 5వేలు అందించారు. దీంతో పాటు టీచర్ కురుమయ్య రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, గ్రామ అధ్యక్షుడు కుమ్మరి గోవిందు, నాయకులు రాంచందర్, శ్రీను, తిరుపతయ్య, ఆర్‌పీ బీసన్న, డాక్టర్ కురుమన్న ఉన్నారు.

ప్రజల వద్దకు పాలన

- కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రూరల్, జనవరి 13: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన అందిస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. లబ్ధిదారులకు అందాల్సిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ప్రజల వద్దకే తీసుకువెళ్తామని, గతంలో బీఆర్ఎస్ పాలనలో మాదిరిగా కార్యాలయాల చుట్టు తిరగాల్సిన శ్రమ ఉండదని మేఘారెడ్డి అన్నారు. శనివారం వనపర్తి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో చెక్కుల కోసం లబ్ధిదారులు ప్రజలు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరిగేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం అలా కాకుండా లబ్ధిదారుల చెంతకే చెక్కులు తీసుకువెళ్తుందని తెలిపారు. నియోజకవర్గం నుంచి తనను భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపినందున ప్రజలకు ధన్య వాదాలు తెలుపుతూ నిజాయితీగా ప్రజల కోసం పని చేస్తానని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్పా అభివృద్ధి చేసిందేమీ లేదని అన్నారు. నిజంగా బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చేసి ఉంటే ఇప్పుడు జిల్లాలో దాదాపు 35వేల దరఖాస్తులు వచ్చేది కాదన్నారు. ఏదుల రిజర్వాయర్ కోసం స్థానిక రైతులు 2,500 ఎకరాల భూమిని కోల్పోయారు. కానీ వనపర్తి జిల్లాకు సాగునీరు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. రాబోయే 5 సంవత్సరాల్లో వనపర్తి జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని దానికి తాను ఒక పెద్ద కొడుకు వలే పని చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీవో, ఎంపీపీ కిచ్చారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో..

గోపాల్‌పేట : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 45వేల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అప్లికేషన్‌లు వచ్చాయని, గోపాల్‌పేట మండలం నుంచి 12,250 అప్లికేషన్లు వచ్చాయన్నారు. తొందరలోనే మిగతా లబ్ధిదారులందరికీ చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో, ఎంపీపీ సంధ్య, జడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, సింగిల్‌విండో చైర్మన్ లోడే రఘు, సర్పంచులు శ్రీనివాస్, నాగమణి, కాంగ్రెస్ నాయకులు సత్యశీలారెడ్డి, పర్వతాలు మేస్త్రీ బాలయ్య, తెలుగు బాలయ్య, కొంకి వెంకటేష్, సుధాకర్ రావు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వాసవి మాత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వనపర్తి జిల్లాలో వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పూరి సురేష్ శెట్టి, పిన్నం నరేందర్, విజయ్, సాయిరాం, అశోక్ కుమార్ ఉన్నారు.

నేటి నుంచి వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



వీరాంజనేయ స్వామి మూలవిరాట్



గట్టుపై వీరాంజనేయ స్వామి ఆలయం



ఖిల్లా గట్టుపైకి వాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు

- **హనుమాన్ మాలధారణ భక్తుల దీక్ష**
- **మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు**
- **భక్తుల కోసం గుట్టపైకి రోడ్డు ఏర్పాటు**

ఖిల్లాఘణపురం, జనవరి 13: ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఖిల్లా గట్టుపై వెలసిన వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. కాకతీయుల కాలం నుంచి పూజలందుకున్న వీరాంజనేయ స్వామిని దర్శించుకోవడానికి, ప్రకృతి అందాలు, కాకతీయుల కాలం నాటి కట్టడాలు వీక్షించడానికి ఉమ్మడి జిల్లా గ్రామాల నుంచే కాకుండా హైదరాబాద్ పట్టణం నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది గుట్టపైకి మెట్ల దారితో పాటు వాహనాలు వెళ్లడానికి రోడ్డు ఏర్పాటు చేయడంతో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. వీరాంజనేయస్వామి భక్తులు మండల దీక్ష చేసి నేడు ఆదివారం ఇరుముడితో ఊరేగింపుగా గుట్టపై గల స్వామి సన్నిధానానికి చేరుకొని రాత్రంతా అఖండ భజనలు చేస్తారు. మరుసటి రోజు సంక్రాంతి పర్వదినాన అఖండ జ్యోతి దర్శనం చేసుకుని బ్రహ్మోత్సవాల్లో దీక్ష విరమణ చేయనున్నారు.

బ్రహ్మోత్సవాల్లో ..

ఖిల్లా గట్టు వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం సుప్రభాత సేవతో ప్రారంభమై స్వామి వారి విశ్వరూప దర్శనం, పాదుకల దర్శనం ఉంటుంది. సోమవారం మకర సంక్రాంతి జ్యోతి ప్రజ్వలన, తమలపాకులతో ప్రత్యేక పూజలు, పెద్ద మంగళ హారతి (అఖండ) జ్యోతి దర్శనంతో భక్తుల మాలాధారణ దీక్ష ముగుస్తుంది. మంగళవారం వీరాంజనేయ స్వామికి అభిషేకం, జలకేలి తెప్పోత్సవం, సాయంత్రం వీరాంజనేయ స్వామి రథోత్సవం నిర్వహిస్తారు.

విజయవంతం చేయాలి



వీరాంజనేయ స్వామి జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆలయానికి వెళ్లడానికి రహదారి మరమ్మతులు చేపట్టడంతో గుట్టపైకి వాహనాలు వెళ్తున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలి.

- పట్టాభి రాములు, ఆలయ ధర్మకర్త

ఆత్మకూరు అభివృద్ధికి కృషి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఆత్మకూరు డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూరు, జనవరి 13: ఆత్మకూరు మండలం అభివృద్ధికి కృషి చేస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలంలో ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మండలంలో పర్యటించారు. ఇటీవల కాలంలో ప్రారంభమైన డిగ్రీ కళాశాలను పరిశీలించారు. డిగ్రీ కళాశాలకు ప్రత్యేకంగా రోడ్డు సౌకర్యం, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. తిప్పడంపల్లి గ్రామంలో ఎంపీటీసీ భర్త అనారోగ్యంతో బాధపడుతున్న సందర్భంగా ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. కార్యకర్తలను ఆదుకుంటామని కార్యకర్తలు లేనిదే కాంగ్రెస్ పార్టీ లేదని గుర్తు చేశారు. అదేవిధంగా ఆత్మకూరు మండలంలోని తిప్పడంపల్లి గ్రామం నుంచి అప్పరాల మీదుగా ఉన్న బ్రిడ్జి అసంపూర్తిగా ఉండడంతో సంబంధిత గుత్తేదారుతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకొని ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వారిని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగిలి గంగాధర్ గౌడ్, అయూబ్ ఖాన్, రహమతుల్లా, మండల అధ్యక్షులు పరమేష్, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, మక్తల్ నియోజకవర్గం యూత్ అధ్యక్షులు తులసిరాజ్ తో పాటు ఆయా గ్రామాల నాయకులు రాజశేఖర్ రెడ్డి, సుధాకర్, రాజు, వెంకటన్న, గంగాధర్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



సోలీపూర్‌లో అక్షింతలను పంపిణీ చేస్తున్న హిందూ వాహిని సభ్యులు



కొత్తకోటలో అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

ఖిల్లాఘణపురం, జనవరి 13: మండలంలోని సోలీపూర్‌లో అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలను శనివారం రామ జన్మభూమి ట్రస్టు సభ్యులు ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. దత్త పీఠం లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగే సమయంలో హిందూ కుటుంబ సభ్యులు అందరూ శిరస్సుపై అక్షింతలు వేసుకుని ఆంజనేయ స్వామి, రామ మందిరాల్లో గంటలు మోగించి శ్రీరాముని దర్శనం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వేద పండితులు గోపాల్ శర్మ, విజయ్ కుమార్ శర్మ, బాలకృష్ణ, బజరంగ్ దళ్ ప్రముఖ్ బెస్త శ్రీను, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కొన్నూరు రాంరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ సభ్యులు సాక వేణు, రాఘవేందర్ రెడ్డి, కిషోర్, మహేష్, అంజి నాయక్, గాల్‌రెడ్డి, సుదర్శన్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

వనపర్తిలో...

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : జిల్లా కేంద్రంలోని కేడీఆర్ నగర్‌లో వీర హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేశారు. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటికి అక్షింతలను అందజేయనున్నట్లు హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొత్తకోటలో...

కొత్తకోట : మండలంలోని నాటవెల్లి పెద్దతండాలో అయోధ్య అక్షింతలను భక్తులు శనివారం ఇంటింటికి పంపిణీ చేశారు. అంతకు ముందు తండాలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రామ కీర్తనాలతో భజన చేశారు. అక్షింతలు పంపిణీ కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్, కిషన్ నాయక్, నారాయణ నాయక్, వెంకటయ్య, జంప్లా నాయక్, దక్షిణ నాయక్, శంకర్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావిలో..

చిన్నంబావి : మండలంలోని గూడెంలో శనివారం అయోధ్య అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండిపర్ల బాలకృష్ణ, సుధాకర్ నాయుడు, లక్ష్మీజి ఉన్నారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు, జనవరి13: అయోధ్య అక్షింతలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని మూలమల్ల గ్రామంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బీజేపీ ఆధ్వర్యంలో అక్షింతల కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సత్యారెడ్డి, భగవాన్ రెడ్డి, నారాయణ రెడ్డి, రాజారెడ్డి, అశోక్ కుమార్, సునంద శేఖర్ తదితరులు ఉన్నారు.

పట్టపగలు విద్యుత్ వెలుగులు

ప్రభుత్వ కార్యాలయంలో వెలుగుతున్న ట్యూబ్‌లైట్లు



తహసీల్దార్ కార్యాలయంలో వెలుగుతున్న విద్యుత్ దీపాలు

ఖిల్లాఘణపురం, జనవరి 13: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం భవనం సముదాయ ఆవరణలో శనివారం పగటి పూట విద్యుత్ దీపాలు వెలుగుతూ దర్శనమిచ్చాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులు సెలవు దినాలు ఉన్న నేపథ్యంలో నిరంతరాయంగా విద్యుత్ దీపాలు వెలగడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భవనాలకు విద్యుత్ వేల రూపాయల్లో బిల్లులు చెల్లిస్తున్నా కనీసం విద్యుత్‌ను సరైన పద్ధతిలో వాడడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లులు భారంగా మారిన నేపథ్యంలో అనవసరంగా విద్యుత్ వాడకం ఎక్కువవుతుంది. ప్రభుత్వ అధికారుల నియంత్రణ లేకపోవడంతో ప్రభుత్వంపై పలు రకాలుగా భారం పెరుగుతోందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఖిల్లాఘణపురం, జనవరి 13: మండలంలోని దొంతికుంట తండాలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వాణి కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష 6వ తరగతి 100 సీట్లకు, 7 నుంచి 10వ తరగతి మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 22 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లలో స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏప్రిల్ 7వ తేదీన 6వ తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 వ తరగతి నుంచి 10వ తరగతి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖిల్లాఘణపురం మండలం దొంతికుంట తండాలోని మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ వాణికుమారి వివరించారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

రేవల్లి, జనవరి 13 : మండలంలోని శానాయిపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం గ్రామ సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి స్వాతి, రెండవ బహుమతి అనూష, మూడో బహుమతి మనీషా గెలుపొందారు. ఈ పోటీలలో సర్పంచ్ లక్ష్మి, గ్రామ ప్రజలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో గ్రామ యువకులు పాల్గొని చేతబడి వంటివి లేవని అదంతా ఒక బూటకమని ముగ్గు వేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ సర్జరీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వనపర్తి రూరల్, జనవరి 13: ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గడ్డె భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, గ్రీన్స్ లాండ్స్ ఆఫ్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ ట్రస్టు వారు ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ప్లాస్టిక్ సర్జరీ శిబిరం నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నేటి నుంచి తమ పేర్లు రేడియంట్ కాన్సెప్ట్ స్కూల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీరంగాపురం విద్యార్థిని

శ్రీరంగాపూర్, జనవరి 13: స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీరంగాపురం విద్యార్థిని మానస ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం నిరంజన్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 16 నుంచి 18 వరకు జనగామ జిల్లాలో నిర్వహించే అండర్-14 బాల బాలికల పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు తరపున మానస ఆడనుందని ఆయన తెలిపారు. మానస రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనందుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు అభినందించారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థి ప్రతిభ

పెబ్బేరు, జనవరి 13: మండలంలోని ఏటిగడ్డ శాఖాపురం గ్రామానికి చెందిన ఏడో తరగతి విద్యార్థి బొడ్డుపల్లి గౌతమ్ చిత్రలేఖనం పోటీల్లో రాష్ట్రస్థాయి మొదటి బహుమతి సాధించారు. గౌతమ్ లింగాల ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతూ హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి అందుకున్నారు. పర్యావరణంపై విద్యార్థి వేసిన చిత్రలేఖనం ఆకట్టుకుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.